# బతుకమ్మ చీరెలు బాగున్నయ్..

**• మురిసిపోతున్న మహిళలు • సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు**



పాల్వంచలో బతుకమ్మ చీరెలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు (ఫైల్)

పాల్వంచ, అక్టోబర్ 7 : పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని 25 రేషన్‌డీలర్ షాపుల ద్వారా బతుకమ్మ చీరెలను జోరుగా పంపిణీ చేస్తున్నారు. చీరెలను అందుకున్న మహిళల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తున్నది. తీరొక్క రంగుల్లో ఉన్న చీరెలను చూసి మురిసిపోతున్నారు. దసరా పండుగకు పెద్దన్నలా చీరెలను పంపిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు చెబుతున్నారు. పండుగ పూట కొత్త చీరెను కట్టుకోవాలనుకునే ఆడబిడ్డల కోర్కెలకు తగ్గట్టుగా రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండుగను పురస్కరించుకుని చిరు కానుకగా చీరెల పంపిణీకి శ్రీకారం చుట్టింది. 2017 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 4వ తేదీ నుంచి పంపిణీ చేస్తున్నది. దీనిలో భాగంగా పాల్వంచ పట్టణ, మున్సిపాలిటీలో ఈ నెల 6వ తేదీన కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలోని 23 వార్డుల్లో 18 సంవత్సరాలు నిండిన 9,048 మంది మహిళలకు చీరెలను అందించే కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతున్నది.

### చాలా ఆనందంగా ఉంది



పండుగ పూట కొత్త చీరెను అందించడం చాలా ఆనందంగా ఉంది. ఇంతవరకూ ఏ ప్రభుత్వం కూడా ఈ విధంగా చీరెలను ఇవ్వలేదు. ముఖ్యమంత్రి కేసీఆర్ సార్ ఆడబిడ్డలందరికీ చీరెలను ఇవ్వడం ఎంతో సంతోషం కలిగిస్తున్నది.

– చరపా ఆదెమ్మ, పునుకుల గ్రామం

### రంగురంగుల చీరెలు ఇస్తుండ్రు



రకరకాల రంగులతో ఉన్న బతుకమ్మ చీరెలను జరీ అంచులతో కూడిన మంచివాటిని ఇవ్వడం బాగుంది. ఏటా తీసుకుంటున్న చీరెల కంటే ఇప్పుడు ఇచ్చే చీరెలు ఇంకా బాగున్నాయి. సీఎం కేసీఆర్ మా ఆడవారికి ఈ విధంగా చీరెలను అందించడం చాలా ఆనందంగా ఉంది.

– బి.సత్యవతి, గట్టాయిగూడెం

### మంచి సంప్రదాయం



పండుగ పూట మహిళలకు చీరెలను పంపిణీ చేయడం మంచి సంప్రదాయం. ఇలాంటి ఆలోచన ఇంతకు ముందు ఎవ్వరూ చేయలేదు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని మహిళలకు బతుకమ్మ పండుగ రోజున ఈ విధంగా చీరెలను అందించడం చాలా గొప్ప విషయం.

– ఎం.జ్యోతి, పాత పాల్వంచ

### పేదల కళ్లల్లో ఆనందం



పండుగ పూట చీరెలను పంపిణీ చేయడం వల్ల పేదల కళ్లల్లో ఆనందం కనిపిస్తున్నది. ఆడవాళ్లకు పండుగ పూట కొత్త చీరె కట్టుకోవాలనే కోరిక ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం కేసీఆర్ మహిళలకు చీరెలు ఇవ్వడం బాగుంది. పండుగ పూట కొత్త చీరె ఇంటికి వచ్చిందంటే పేదోళ్లకు ఆనందంగా ఉంటుంది.

– కె.ధనలక్ష్మి, పాల్వంచ

## ఈవీఎంల గోదాం వద్ద పటిష్ట భద్రత

**కలెక్టర్ ప్రియాంక ఆల**



ఈవీఎంల గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 7 : ఈవీఎం, వీవీప్యాట్ వేర్‌హౌస్ వద్ద పటిష్ట భద్రత కొనసాగుతున్నదని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. శనివారం కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలోని వీవీప్యాట్, ఈవీఎం, గోడౌన్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈవీఎం, వీవీప్యాట్‌లు పరిశీలించి తనిఖీ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం గోదాం రక్షణ ఏర్పాట్లను తనిఖీ చేసి నివేదిక పంపనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, కాంగ్రెస్ నుంచి ఎల్.సంతోశ్, సీపీఐ నుంచి అన్నవరపు సత్యనారాయణ, బీజేపీ నుంచి లక్ష్మణ్ అగర్వాల్, సీపీఐ నుంచి శ్రీనివాసరెడ్డి, బీఎస్పీ నుంచి యెర్రా కామేశ్ పాల్గొన్నారు.

## రైళ్లను పునరుద్ధరించాలి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 7 : భద్రాచలం రోడ్ కొత్తగూడెం రైల్వేస్టేషన్ నుంచి నడుస్తూ కరోనా సమయంలో రద్దు అయిన రైలు సర్వీసులను తిరిగి పునరుద్ధరించాలని అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఎంపీ నామా నాగేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ కరోనా కంటే ముందు భద్రాచలం రోడ్ నుంచి 7 రైల్వే సర్వీసులు నడిచాయని కరోనా కాలంలో వాటిని రద్దు చేసి ఇంకా పునరుద్ధరించలేదన్నారు. సింగరేణి, డోర్నకల్ ప్యాసింజర్, విజయవాడ ప్యాసింజర్, కాజీపేట ప్యాసెంజర్, కాకతీయ ప్యాసింజర్, కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్, మణుగూరు సూపర్‌ఫాస్ట్ సర్వీసులు ఉండగా ప్రస్తుతం కాకతీయ ప్యాసింజర్, మణుగూరు సూపర్‌ఫాస్టు మాత్రమే నడుస్తున్నాయన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున రైలు సర్వీసులను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కొదమసింహం పాండురంగాచార్యులు, వై.శ్రీనివాసరెడ్డి, లిక్కి బాలరాజు, మాచర్ల సత్యం, అన్నవరపు సత్యనారాయణ, కంచర్ల జమలయ్య, నగేశ్, ధర్మా పాల్గొన్నారు.

# ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ

**• చీరెల పంపిణీలో ఎమ్మెల్యే వనమా**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 7 : తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డలకు బతుకమ్మ కానుకగా చీరె సారె ఇచ్చిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్నదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే గ్రామాలన్నీ సస్యశ్యామలంగా ఉన్నాయని, అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఎంపీపీలు బదావత్ శాంతి, భూక్యా సోనా, ఏఎంసీ చైర్మన్ భూక్యా రాంబాబు, తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్, ఆర్ఐలు రాంబాబు, శంకర్, ఎంపీటీసీలు కొల్లు పద్మ, స్వాతి, కో ఆప్షన్ మెంబర్ జక్కుల సుందర్, సర్పంచ్‌లు భూక్యా పద్మ, రవి, చింటూ, బండ వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు శేషాద్రి వినోద్, సత్యనారాయణ, ఇక్బాల్, కనకరాజు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు

**అదనపు కలెక్టర్ రాంబాబు**



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో పత్తిపంట చేతికందిందని, ఈ నెల మూడోవారం నుంచి కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ రాంబాబు తెలిపారు. 2023–24 కాటన్ మార్కెటింగ్ సీజన్ యాక్షన్‌ప్లాన్ మీటింగ్ శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నిర్వహించారు. వ్యవసాయశాఖ సమాచారం ప్రకారం ఈ సీజన్‌లో 2,00,373 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారని, 1,20,224 మెట్రిక్ టన్నుల పత్తి వచ్చే అవకాశం ఉందన్నారు. భారత పత్తి సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ద్వారా రైతులు పంటను అమ్ముకొని కనీస మద్దతు ధర క్వింటాకు రూ.7020 పొందాలని సూచించారు. దీనికోసం వ్యవసాయ అధికారుల ద్వారా ధ్రువీకరణను సమర్పించాల్సి ఉంటుందన్నారు. వేలిముద్ర(బయోమెట్రిక్ విధానం ద్వారా ఆధార్ ప్రమాణీకరణ) చేయించుకోవాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ ఆలీం, జిల్లా వ్యవసాయ అధికారి అభిమన్యుడు, కొత్తగూడెం ఏఎంసీ సెక్రటరీ వెంకటేశ్వర్లు, బూర్గంపాడు, ఇల్లెందు ఏఎంసీ సెక్రటరీ నిర్మల, భద్రాచలం ఏఎంసీ సెక్రటరీ రాము, జిన్నింగ్ మిల్ ఓనర్లు, ట్రేడర్లు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేయించుకుంటున్న జడ్జి పాటిల్ వసంత్

## న్యాయవాదులకు నేత్ర పరీక్షలు

చుంచుపల్లి, అక్టోబర్ 7 : కొత్తగూడెం కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ ప్రారంభించారు. కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో న్యాయవాదులతోపాటు న్యాయవాద గుమస్తాలు, కోర్టు సిబ్బంది మొత్తం 131మందికి పరీక్షలు చేసినట్లు బార్ అధ్యక్షుడు రమేశ్‌కుమార్ మక్కడ్ పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ ఆఫీస్ బేరర్లు రావిలాల రామారావు, దుంద్ర రమేశ్, కాసాని రమేశ్, సాహు సంతోష్‌లాల్, ఏ. మనోరమ, యాస యుగంధర్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు అన్నపూర్ణ పాల్గొన్నారు. ఖమ్మంకు చెందిన శరత్‌మాక్సి విజన్ సూపర్ స్పెషాలిటీ ఐ ఆస్పత్రి సిబ్బంది పోలం శ్రీనివాస్, రాగోలు పృథ్వీ, పందిరి రవికుమార్, బానోత్ అనిల్ కంటి పరీక్షలు చేశారు.

## పలు కుటుంబాలకు ఎంపీ పరామర్శ



పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎంపీ నామా

చుంచుపల్లి, అక్టోబర్ 7 : బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు శనివారం కొత్తగూడెంలో పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. విద్యానగర్‌లో ఉప సర్పంచ్ లక్ష్మి భర్త పిచ్చయ్య ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాన్ని నామా పరామర్శించారు. ఎన్‌కేనగర్‌లో బిక్కసాని నాగేశ్వరరావు సోదరి జొన్నలగడ్డ భాగ్యమ్మ మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఎంజీరోడ్‌లో డాక్టర్ సీహెచ్ కృష్ణప్రసాద్, డాక్టర్ సుబ్బారావు మాతృమూర్తి మృతిచెందగా వారింటికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఎంపీపీ శాంతి, కొట్టి వెంకటేశ్వర్లు, గుగులోత్ కృష్ణ, సురేశ్, కొదురుపాక రాజేంద్రప్రసాద్, లగడపాటి రమేశ్, జగన్ ఉన్నారు.